క్లుప్తంగా

జాబ్‌మేళాలో 62 మంది ఎంపిక



జాబామేళాకు హాజరైన వారికి సూచనలు చేస్తున్న కంపెనీల ప్రతినిధులు

బొబ్బిలి: పట్టణంలోని ఇందిరాగాంధీ డిగ్రీ కాలేజ్‌లో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాకు 130 మంది యువతీ, యువకులు హాజరు కాగా అందులో 62 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ బలగ అప్పలనాయుడు తెలిపారు. అచ్యుతాపురం, పరవాడ ప్రాంతాల్లోని అయిదు కంపెనీల ప్రతినిధుల ఆధ్వర్యంలో కెమిస్ట్,ఆపరేటర్ ఉద్యోగాలతో పాటు అప్రెంటీస్ షిప్‌ల కోసం ఈజాబ్ మేళా నిర్వహించామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15 వేల నుంచి రూ.18వేల వేతనం, అలవెన్సులు లభిస్తాయన్నారు. ఆయా కంపెనీల హెచ్‌ఆర్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐ స్థలాన్ని లీజుకు ఇవ్వొద్దు

బొబ్బిలి: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ స్థలాన్ని, అక్కడి భవనాన్ని పర్యాటక శాఖకుగతంలో లీజుకు ఇచ్చారని,దానిని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ స్థలం,భవనాన్ని బీజేపీ నాయకుడికి లీజుకు ఇవ్వడం దారుణమని, వెంటనే లీజు రద్దు చేయాలని కోరుతూ కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో వినతిపత్రం అందజేశామని చెప్పారు. జేసీ సేతు మాధవన్ స్పందించి బొబ్బిలి ఆర్డీఓ రామమోహనరావుకు ఫోన్ చేసి వెంటనే తగు విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కోరారని చెప్పారు.

పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి



ఏపీజీఈఏ కార్యవర్గ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ

రాజాం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ,ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించడంతో పాటు 12వ పీఆర్సీ కంటే ముందే ఐఆర్ ప్రకటించాలని ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు కంది వెంకట రమణ డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించ డంతోపాటు దసరాకు పెండింగ్ డీఏలు ప్రకటించాలని కోరారు. ప్రస్తుతం ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం ఉద్యోగులపై ఒత్తిడిలేకుండా చూడాలని కోరారు.ఎంపీడీఓ ఆనందరావు, డిప్యూటీ ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

బొబ్బిలిరూరల్: నేర చరిత్ర ఉన్న నిందితులంతా సత్ప్రవర్తనతో మెలగాలని బైండోవర్‌లో ఉన్నవారిని తహసీల్దార్ ఎం.శ్రీను హెచ్చరించారు. వివిధ కేసుల్లో బైండోవర్ చేసిన వారితో పాటు, రౌడీషీట్ ఉన్న వారితో తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రౌడీ షీట్, బైండోవర్ కేసులు ఉన్న వ్యక్తులపై నిఘా ఉంచామని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, గొడవలు సృష్టించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పశువులకు టీకాలు

తెర్లాం: పాడి రైతులు పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి జె.నరేంద్రకుమార్, నెమలాం పశువైద్య కేంద్రం డాక్టర్ అరుణ సూచించారు. మండలంలోని అప్పలంపేట, కొల్లివలస, రంగప్పవలస గ్రామాల్లో ఏహెచ్‌ఏలు పశువులకు సోమవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. కార్యక్రమాన్ని పశు వైద్యాధికారులు పర్యవేక్షించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



వైద్యసేవలందిస్తున్న డాక్టర్ అపర్ణ

రామభద్రపురం: మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆరికతోట పీహెచ్‌సీ వైద్యాధికారి అపర్ణ సూచించారు. స్వస్త్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా పలువురి వైద్యాధికారులతో కలిసి ఆరికతోట పీహెచ్‌సీ పరిధిలో మహిళలకు సోమవారం వైద్య పరీక్షలు చేశారు. రేడియోలజీ వైద్యాధికారి జె.ప్రసాదరావు,ఆయుర్వేద వైద్యాధికారి సుబ్బరాయుడు, డాక్టర్ గాయత్రి,ఆస్పత్రి సిబ్బంది సేవలందించారు.

పండగ పూటా పస్తులే..!



బూసాయవలసలోని కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం

- అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు రెండు నెలలుగా అందని వేతనాలు
- అసలే చాలీ చాలని జీతాలతో చాకిరీ
- నెలల తరబడి వేతనాలు పెండింగ్ ఉంచితే కుటుంబ పోషణ ఎలా అంటున్న చిరుద్యోగులు



రామభద్రపురం ఎమ్మార్సీలో సమగ్రశిక్ష సిబ్బందికి సూచనలిస్తున్న ఎంఈఓ తిరుమలప్రసాద్ (ఫైల్)

రామభద్రపురం: అధికారంలోకి వస్తే ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తామని,మెరుగైన పీఆర్సీ ప్రకటించి పెండింగ్ బకాయిలు మొత్తం చెల్లిస్తామని సార్వత్రిక ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి నేతలు హామీ ఇచ్చారు.ప్రభుత్వం కొలువుదీరి 16 నెలలు కావస్తున్నా పీఆర్సీ ప్రకటించకపోగా పెండింగ్ బకాయిలు కూడా చెల్లించలేదు. విద్యాశాఖలో సేవలందిస్తున్న సమగ్ర శిక్ష అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ చిరుద్యోగుల సమస్యల పరిష్కారం మాట దేవుడెరుగు. వారికి వేతనాలు కూడా సకాలంలో అందకపోతుండడంతో కుటుంబ పోషణకు అవస్థలు పడుతున్నారు. రెండు నెలలుగా వేతనాలు అందలేదని, దసరా పండగ కైనా వేతనాలు చెల్లిస్తారో లేదోనని ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖలోని సమగ్రశిక్షలో సుమారుగా 1,200 నుంచి 1,300 మంది వరకు ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో సీఆర్‌ఎంటీలు 153 మంది, కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న (కేజీబీవీ) సిబ్బంది 650 మంది, మండల లెవెల్ అకౌంటెట్స్ 12 మంది,ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు 25 మంది,డేటా ఎంట్రీ ఆపరేటర్లు 25 మంది, తదితరులు పనిచేస్తున్నారు.వీరికి రెండు నెలల వేతనాలు ప్రభుత్వం బకాయిపడి ఉంది.

అప్పులు చేయాల్సి వస్తోంది..

నెలల తరబడి వేతనాలు అందడంలేదు. అప్పులు చేయాల్సి వస్తోంది. సకాలంలో వేతనం జమచేయకుంటే కుటుంబాలు ఎలా నడుస్తాయో ప్రభుత్వం ఆలోచించాలి.ఇప్పటికైనా ప్రభుత్వం క్రమం తప్పకుండా ఒకటో తేదీన వేతనాలు చెల్లించే విధంగా చూడాలి.అలాగే నిత్యావసర సరకుల ధరలు,వైద్య ఖర్చులు, పెరగడంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు సరిపోవడం లేదు. వేతనాలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలి.

– బొప్పె సురేష్‌కుమార్, సీఆర్‌ఎంటీ, రామభద్రపురం

ఇబ్బందులు పడుతున్నాం..

రెండు నెలల వేతనాలు పెండింగ్ ఉన్నాయి.వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నాం. కుటుంబ పోషణకు రోజు వారీ ఖర్చులు,ఇతర అవసరాలకు అప్పులు చేయాల్సి వస్తోంది.దసరా పండగకైనా వేతనాలు చెల్లించాలి.

– బి.వెంకటేష్, ఎంఐఎంఎస్ ఆపరేటర్, రామభద్రపురం

త్వరలో చెల్లిస్తాం..

సమగ్రశిక్షలో పనిచేసే అన్ని విభాగాల ఉద్యోగులకు త్వరలో వేతనాలు చెల్లిస్తాం.నెలన్నరోజులకు సంబంధించి వేతనాలు చెల్లించాల్సి ఉంది.కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు నిధులు ఇందుకు సమకూర్చాల్సి ఉంది.వేతనాల పెంపు విషయం ఉద్యోగులు నా దృష్టికి తీసుకురాలేదు. నా దృష్టికి వస్తే,ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం.

– ఏ.రామారావు, సమగ్రశిక్ష జిల్లా కో–ఆర్డినేటర్

గత ప్రభుత్వంలో పెరిగిన వేతనాలు

చాలీచాలని వేతనాలతో సమగ్ర శిక్షలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి వేతనాలు పెంచారు. 2020 వరకు సమగ్ర శిక్షలో పనిచేసే ఉద్యోగులకు నెలకు రూ.18,500 వేతనం ఇచ్చే వారు. వీరి వేతనాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.23,500కు పెంచింది.అలాగే ఆప్కాస్(ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఫర్ అవుట్ సోర్సింగ్ సర్వీసెస్) ప్రవేశపెట్టి వారి ఉద్యోగ భద్రతకు చర్యలు తీసుకుంది.

చారిత్రకమైనది కళింగాంధ్ర



ముంజూరు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

రాజాం సిటీ: ఉత్తరాంధ్రగా పిలుచుకునే కళింగాంధ్ర చారిత్రకమైనదని సిక్కోలు బుక్‌ట్రస్ట్ అధ్యక్షుడు దుప్పల రవికుమార్ అన్నారు. సోమవారం స్థానిక జీసీఎస్‌ఆర్ కళాశాలలో 'ముంజూరు' కవితాసంకలనాన్ని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రవీంద్ర ఆవిష్కరించగా, రవికుమార్ పరిచయం చేస్తూ మాట్లాడారు. కళింగాంధ్రలో గురజాడ, గిడుగు, తాపీ ధర్మారావు, కోడి రామ్మూర్తి వంటి ఘనులు జన్మించారని, ఇక్కడి యాస, భాష ప్రత్యేకమైనదని అన్నారు. 'ముంజూరు' కవితాసంకలనం పుస్తకంలో కళింగాంధ్రకు చెందిన 72 మంది కవులు రచించిన 130 కవితలు ఉన్నాయని, ఇవన్నీ ఈ ప్రాంతపు అస్తిత్వాన్ని తెలియజేస్తాయని వివరించారు. సంపన్నమైన నదీ పరివాహక ప్రాంతం కలిగిన ప్రదేశం కళింగాంధ్ర అని, ఇక్కడి తూర్పు కనుమలు సంపద లకు నిలయాలని, పొడవైన సముద్రతీరం కలిగిన ప్రాంతమని విద్యార్థులకు వివరించారు. ఈ ప్రాంత చరిత్రను తెలుసుకుని గొప్ప వక్తలుగా మారాలని సూచించారు.రాజాం రచయితల వేదిక కన్వీనర్ గార రంగనాథం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నేతేటి గణేశ్వరరావు, పిల్లా తిరుపతిరావు, తురంగి విశ్వనాథం, అప్పన్న, కుదమ తిరుమలరావు, పెంకి చైతన్యకుమార్, మూడడ్ల శ్రీనివాసరావు, సమతం మహేశ్వరరావు, పడాల కవీశ్వరరావు, పారుపల్లి కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

• పరామర్శ



సంతకవిటి: స్రవంతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాజేష్, తదితరులు

సంతకవిటి: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, రాజాం ఏఎంసీ మాజీ చైర్మన్ సిరిపురపు కుమారస్వామి కుమార్తె స్రవంతి ఇటీవల మృతి చెందారు.ఈ విషయం తెలుసుకున్న రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ సోమవారం హొంజరాం గ్రామం వెళ్లి కుమారస్వామి కుటుంబాన్ని పరా మర్శించారు. మృతురాలు స్రవంతి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు, రాజాం టౌన్ వైఎస్సార్ సీపీ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, గరికిపాడు సర్పంచ్ యడ్ల రామకృష్ణ, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు శాసపు వేణునాయుడు, పార్టీ జిల్లా కల్చరల్ విభాగం అధ్యక్షుడు డాక్టర్ నరేంద్ర, నాయకులు గురువు సింహాచలం, కంచరాపు రాము, టొంపల లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



తెర్లాం: అప్పారావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

మాజీ ఎమ్మెల్యే శంబంగి పరామర్శ

తెర్లాం: మండలంలోని అరసబలగ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జగ్గుపల్లి అప్పారావు పెద్ద కుమారుడు రాము ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అప్పారావు కుటుంబ సభ్యులను బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే, ఆ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సోమవారం పరామర్శించారు. అప్పారావు కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో సుందరాడ గ్రామ సర్పంచ్ అద్దంకి దిలీప్‌కుమార్, పాములవలస, గోపాలవలస సర్పంచ్‌ల ప్రతినిధులు చప్ప ఈశ్వరరావు, గొందాల వెంకటరావు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

పని గంటల పెంపు నిర్ణయం సరికాదు



మాట్లాడుతున్న జేసీ రాజు

బొబ్బిలి: ఉద్యోగ, ఉపాధ్యాయులు, కార్మికులు పోరాడి 140 ఏళ్ల క్రితం సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని కూటమి ప్రభుత్వం 13 గంటలకు పెంచేలా నిర్ణయం తీసుకోవడం సరికాదని, ఈ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కౌన్సిలర్ జేసీ రాజు డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ఏపీటీఎఫ్ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాల్లోని కొన్నిలేబర్ కోడ్‌లను వరుస క్రమంలో మార్చికార్మికులను బానిసలుగా మార్చేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని, అన్నారు. దానిలో భాగమే ఏపీ అసెంబ్లీలో పనిగంటల పెంపు అంశం బిల్లుగా మారిందన్నారు. దీనిని ఆమోదింప జేసి బడా పారిశ్రామిక వేత్తల మెప్పు కోసం కార్మికులను కట్టుబానిసలుగా మార్చుతారన్నారు. పని గంటలను 8 నుంచి 6 గంటలకు తగ్గించాల్సింది పోయి తిరిగి పెంచడం ఎంత వరకూ సబబని ప్రశ్నించారు. ప్రభుత్వానికి అండగా నిలబడిన ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో శ్రద్ధ చూపని రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిదారులనే వెనుకేసుకొస్తోందన్నారు. ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, సభ్యులు ఆర్.ఎస్.రాజు,అప్పారావు, చిన్నారావు,శంకరరావు, కృష్ణ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల హక్కులను కాపాడడంలో విఫలం



విలేకరులతో మాట్లాడుతున్న సురేష్, శ్రీనివాసరావు

రేగిడి: ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల హక్కులను కాపాడడంలో జిల్లా అధికార యంత్రాంగం విఫలమైందని రాష్ట్ర వెలమ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కింజరాపు సురేష్, వైఎస్సార్‌సీపీ రాజాం నియోజక వర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు ఆరోపించారు. మండలం లోని కె.వెంకటాపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడు తూ జిల్లా యంత్రాంగం అధికారపక్ష నేతలకు వత్తాసు పలకడం వల్లే మండల, గ్రామస్థాయి అధికారులు ప్రతిపక్ష ప్రజా ప్రతినిధుల విషయంలో ప్రొటోకాల్ పాటించడంలేదన్నారు. ఇటీవల పాలకొండ ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశానికి ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌కు అధికారులు ఆహ్వానం పంపించారని, ఆయన సమావేశానికి వెళ్లే సమ యంలో లోపలికి ప్రవేశం లేదంటూ పోలీసులతో అడ్డుకోవడం దారుణమన్నారు. ఎమ్మెల్సీ పట్ల వ్యవహరించిన తీరు తీవ్ర ఆక్షేపణీయమని మండిపడ్డారు.ఈనెల 20న జరిగిన శ్రీకాకుళం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఇదే సమస్యపై జెడ్పీటీసీలు, ఎంపీపీలు ప్రశ్నించగా, వారిపై జెడ్పీ సీఈఓ వ్యవహరించిన తీరు ఆయన అహంకారానికి నిదర్శనమని అన్నారు. శ్రీకాకుళం జెడ్పీ సీఈఓ, పాలకొండ ఎంపీడీఓపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మండల వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు కెంబూరు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల జీవితాలతో ఆడుకోవడం మూర్ఖత్వం



ధర్నా చేస్తున్న కార్మికులు

రాజాం సిటీ: కార్మికులు, ఉద్యోగులు, శ్రామికులు, మహిళల హక్కులను కాలరాసేలా రాష్ట్ర ప్రభుత్వం చేసిన కార్మిక చట్ట సవరణ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి సీహెచ్.రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ జంక్షన్ వద్ద కార్మికులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 గంటల విధానాన్ని 13 గంటలకు పెంచే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని కోరారు. ఓ వైపు శాస్త్ర సాంకేతిక రంగం ఇంతలా అభివృద్ధి చెందుతుంటే మనిషి చేసే శ్రమ, పనిగంటలు తగ్గాలని ప్రభుత్వం ఆలోచన చేయకుండా కార్మికుల జీవితాలతో ఆడుకోవడం మూర్ఖత్వమని మండిపడ్డారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలనే రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అవలంబించడం దారుణమన్నారు. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న 8గంటల పనివిధానాన్ని ఒక్క కలం పోటుతో రద్దుచేశారని, కనీసం అసెంబ్లీలో చర్చకూడా జరపకుండా ఏకగ్రీవంగా కార్మిక వ్యతిరేక విధానాన్ని టీడీపీ కూటమి ఎమ్మెల్యేలు ఆమోదించారని ఆరోపించారు. గతంలో మహిళలకు రాత్రి షిఫ్ట్‌లకు అనుమతించేవారు కాదని, ప్రస్తుతం రాత్రి పని చేయించుకునే విధానాన్ని తీసుకువచ్చారని, ఇది పూర్తిగా మహిళలపట్ల బాధ్యతారాహిత్యాన్ని సూచిస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వానికి కష్టజీవులపై ఉన్న శ్రద్ధ ఏపాటిదో ఇట్టే అర్థమవుతోందని, ఈపార్టీల పట్ల ఉన్న భ్రమలను విడనాడి పెద్ద ఎత్తున పోరా టాలకు సిద్ధం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్మిక సంఘాల నాయకులు అనీల్‌కుమార్, గురువులు, బాలరాజు, వైకుంఠ, వాసు, సుధాకర్, రవి, వెంకట్, గోపి, సింహాచలం, అచ్యుతరావు, గౌరమ్మ, లక్ష్మి, జయశ్రీ, సుగుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జగన్మాతా నమోస్తుతే

- ఘనంగా ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలు

శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని అమ్మవార్ల ఆలయా లతో పాటు వాడ వాడలా ఉత్సవ కమిటీలు మంటపాలు ఏర్పాటు చేసి దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. తొలిరోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. – సాక్షి నెట్‌వర్క్



బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలోని కంచర వీధిలో దుర్గాదేవిని కొలుస్తున్న భవానీ భక్తులు



బొబ్బిలి: బ్యాంకు కాలనీలో ఏర్పాటు చేసిన అమ్మవారి మంటపంలో పూజలు చేస్తున్న మహిళలు



సంతకవిటి: చిన్న సిరిపురంలో అమ్మవారి ఊరేగింపులో కలశాలతో మహిళలు




బొబ్బిలి: దాడితల్లి ఆలయంలో బాలా త్రిపురసుందరిగా దర్శనమిచ్చిన అమ్మవారు



బాడంగి: బాడంగిలోని ఉమాసోమేశ్వరాలయంలో పూజలుచేస్తున్న మహిళలు



తెర్లాం: తెర్లాం పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన మంటపంలో పూజలందుకుంటున్న అమ్మవారు



బొబ్బిలిరూరల్: దిబ్బగుడ్డివలసలో ఏర్పాటు చేసిన మంటపంలో బాలాత్రిపురసుందరి అవతారంలో అమ్మవారు



రాజాం సిటీ: రాజాంలోని నవదుర్గ ఆలయానికి అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువస్తున్న ఆలయ ఈఓ శ్యామలరావు, భక్తులు



రాజాం సిటీ: కంచరాంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



రేగిడి: రేగిడిలో పూజలు చేస్తున్న భవానీ భక్తులు



వంగర: రుషింగిలో అమ్మవారి విగ్రహం ఊరేగింపులో భక్తులు



సంతకవిటి: సంతకవిటిలో ఏర్పాటు చేసిన మంటపంలో కొలువు దీరిన నవదుర్గలు



రాజాం: రాజాం గాయత్రికాలనీలోని ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వైద్యశిబిరాలను సద్వినియోగించుకోండి



రేగిడి: ఉంగరాడలో వైద్యసేవలందిస్తున్న వైద్యాధికారులు

రేగిడి: గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారులు సీహెచ్.అసిరినాయుడు, సోహినీరాఘవ్ సూచించారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉంగరాడలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో మహిళలు, వృద్ధులకు వివిధ వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచిచల్లార్చిన నీటిని తాగాలని ప్రజలకు వైద్యాధికారులు అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. సర్పంచ్ చల్లా భుజంగరావు, పీహెచ్‌సీ సీహెచ్‌ఓ సుందరేశ్వరరావు, సూపర్‌వైజర్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వైద్యపరీక్షలు

వంగర: మండల పరిధి సంగాంలో వంగర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారి సుష్మిత దయానా, వైద్యసిబ్బందితో కలిసి 120 మంది మహిళలకు వైద్యపరీక్షలు చేశారు. అనంతరం అవగాహన ర్యాలీ చేశారు. ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



రామభద్రపురం: ఆరికతోటలో గర్భిణులకు సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ పీఓ వరహాలమ్మ, సూపర్‌వైజర్లు

రామభద్రపురం: గర్భిణులు,బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ పీఓ వరహాలమ్మ అన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో ఆరికతోట అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన పోషణ మహా ప్రోగ్రామ్‌లో భాగంగా గర్భిణులకు సీమంతాలు చేశా రు. అనంతరం గర్భిణులు,బాలింతలకు పౌష్టికాహారం, తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.

పౌష్టికాహార ప్రదర్శన, వైద్యశిబిరాల నిర్వహణ

తెర్లాం/ బాడంగి: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా తెర్లాం మండలం కొరటాం గ్రామ సచివాలయం వద్ద, బాడంగి మండలంలోని భీమవరం విలేజ్‌క్లినిక్‌వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం పౌష్టికాహార పదార్థాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. అలాగే కొరటాంలో తెర్లాం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో మహిళలకు, బాలికలకు వైద్యాధికారులు స్వాతి, వంశీకృష్ణ వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. భీమవరంలో నిర్వహించిన శిబిరంలో వైద్యాధికారి ఆదిత్య, వైద్యసిబ్బంది మహిళలు, బాలికలకు వైద్య పరీక్షలు చేశారు. అలాగే గర్భిణులకు సీమంతం చేశారు.